


టిడ్కో గృహాలపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - మండపేట

మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు టిడ్కో గృహాలపై శుక్రవారం మున్సిపల్, టిడ్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడ్కోకి సంబంధించి పలు విషయాలపై ఆయన అధికారులతో చర్చించారు. రెండవ విడత టిడ్కో ప్లాట్లు 300 చదరపుగజాలుకు సంబంధించి 43 బ్లాకులలో మిగిలి ఉన్న పనుల ను పూర్తిచేసి లబ్ధిదారులకు వచ్చే నెల 5వ తేదీ లోగా అందించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టివి.రంగారావు, టిపిఒ శ్రీరమ్య, టిడ్కో ఎఇ వివేక్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్
- ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - కాట్రేనికోన

సముద్రపు తీర ప్రాంత మత్స్యకారులు, డ్వాక్రా మహిళలు సముద్ర నాచు, పీతలు ఆర్నమెంట్ చేపలు పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చిర్రయానం తీర ప్రాంతంలో తొలిదశలో 12 యూనిట్లకు సంబంధించి ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని సముద్రపు నాచు సాగు యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రపు నాచు తయారీ ప్రత్యా మ్నాయ జీవనోపాధిగా నిలుస్తుందన్నారు. తదుపరి దశలో పది యూనిట్లు పీతలు పెంపకానికి చర్యలు తీసుకుంటామని తదుపరి 7 యూనిట్లు రంగు (ఆర్న మెంట్) చేపల పెంపకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 29 యూనిట్లు రూ.11లక్షల 10 వేల అంచనా వ్య యంతో చేపట్టినట్లు తెలిపారు. సముద్రపు నాచు సాగు యూనిట్కు రూ.18,000 పెట్టుబడి వ్యయంగా నిర్ధారించగా దీనిలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సబ్సిడీగా రూ.11,662 లు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీగా రూ. 6,338 అందించనున్నారు. దీనికి అదనంగా డ్వాక్రా రుణం కూడా అందిస్తారని తెలిపారు. పీతల యూనిట్కు పెట్టుబడి వ్యయం రూ.19,404 కాగా దీనిలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సబ్సిడీ రూ.19, 404లు లభిస్తుందన్నారు. రంగు చేపల పెంపకం యూనిట్కు లక్ష పెట్టుబడి వ్యయం కాగా, దీనిలో గ్రీన్ క్లైమేట్ సబ్సిడీ రూ.45,948, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.54,052 రాయితీగా లభిస్తుందన్నారు . తొలుత మత్స్యకార డ్వాక్రా లబ్ధిదారు మహిళలతో మాట్లాడుతూ సముద్రపు నాచు, పీతలు రంగు చేపలు తయారీ వల్ల కలిగే లాభాలను ప్రయోజనాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్య సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవి ధంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తిలకించి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం తుపాను సెంటర్ నందు ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ సముద్రపు నాచు పర్యావరణానికి, వ్యవసాయానికి రెండు కోణాల నుండి దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందన్నారు. ఈ ప్రకతి సహజమైన నాచు తయారీకి తక్కువ పెట్టుబడితో అధిక లాభదాయకతను అందించే తాజా వ్యవసాయ అవకాశంగా భావించాలన్నారు. తక్కువ పెట్టుబడితో కేవలం 45 రోజుల కాలవ్యవధిలో అధిక ఆదాయాన్ని పొంద వచ్చునన్నారు. పలువురు శాస్త్రవేత్తల అధ్యయనం తర్వాత అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి సాగు చేపట్టినట్లు తెలిపారు. ఈ సముద్రపు నాచు తయారీకి అనువైన ఉష్ణోగ్రతలు, ఉప్పు శాతం ఉన్న నీటి పరిసరాలలో మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ గంగ పుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక గా మత్స్య పరిశ్రమ నిలుస్తోందన్నారు. మత్స్య ఉత్పత్తులు పెంపు సాంకేతికత ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి చేస్తూ నీలి విప్లవం సాధించే దిశగా ముందడుగు వేస్తోందన్నారు. గంగపుత్రులందరికీ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేపల వేట నిషేధిత సమయంలో జీవనభతిని రూ.2వేలకు పెంచినట్లు తెలిపారు. గంగ పుత్రులకు ఇంధన రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్డిఒ కె. మాధవి ప్రసంగిస్తూ సముద్రపు నాచు కార్బన్ ఆకర్షించి నీటిని శుభ్రం చేయడంలో సహాయపడి సముద్ర జీవులకు కార్బన్ ము ప్పును తగ్గిస్తుందన్నారు. తీర ప్రాంత మహిళలు మత్స్యకారి కుటుంబాలకు భరోసా ఇవ్వడమే కాకుండా వేగంగా ఆదాయ వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. డ్వాక్రా సంఘాలకు ఈ సాగుకై రుణాలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పివి.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ జయచంద్ర గాంధీ, మత్స్య శాఖ ఎడి వర్ధన్ ఎఫ్ డిఒ. కె.చలపతి, ఆక్వా బోర్డ్ రాష్ట్ర డైరెక్టర్లు విత్తనాలు నాగ శ్రీనివాసరావు, దేశం జెట్టి లక్ష్మీనారాయణ , స్థానిక సర్పంచ్ ఓలేటి మంగాదేవి, తహశీల్దార్ రవికిరణ్, నడింపల్లి సుబ్బరాజు, పిఎస్ ఎన్.రాజు, ఎస్‌విఎస్.రవివర్మ , స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చిర్రయానం గ్రామంలో సముద్రపు నాచు పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

రాజ్యాంగ దినోత్సవ సభ జయప్రదాని పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీహాల్ నందు నిర్వహించే సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రవితేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 26 అమలాపురంలో జరిగే సభకు వక్తలుగా ప్రొఫెసర్ అంజయ్య (రిటైర్డ్) నాగార్జున విశ్వవిద్యాలయం, వివిఎస్.కష్ణ (మానవహక్కుల వేదిక), డాక్టర్ చల్లా రవికుమార్ జెవివి రాష్ట్ర నాయకులు, సిస్టర్ మంజుల దేవరపల్లి, నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్, కెఎంఎ.సుభాన్, మేలుకో ఆంధ్రప్రదేశ్ తదితరులు హాజరవుతున్నారని అన్నారు. ఈ సభను జయప్రదం చేయాలన్నారు.

రాజ్యాంగ దినోత్సవ సభకు తరలి రావాలి

మామిడికుదురు: అమలాపురం లో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఈ నెల 26న నిర్వహించే రాజ్యాంగ దినోత్సవ సభకు ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు తరలి రావాలని రాష్ట్ర నేత దీపాటి శివప్రసాద్ పిలుపునిచ్చారు. పెదపట్నంలో భూపతి వెంకటపతి ఇంటి వద్ద అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కలిగితి పల్లంరాజు అధ్యక్షతన సమావేశం జరిగినది. ఈ సందర్భంగా నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు అనంతరం రాజ్యాంగ దినోత్సవ కమిటీఅధ్యక్షులుగా: బత్తుల జనార్ధనరావు, ఉపాధ్యక్షులుగా ముసుడి నరసింహ స్వామి, ప్రధాన కార్యదర్శిగా నీతిపూడి మహేష్, సహాయ కార్యదర్శి బొంతు చంద్రశేఖర్,ట్రెజరర్గా నేల సూర్యనారాయణ, సభ్యులును నియమించారు ఈ కార్యక్రమంలో నీతిపూడి చంద్రరావు, నూటు కుర్తి సత్యనారాయణ , విప్పర్తి సాయిబాబా తదితర పెద్దలు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవితేజ, కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌సి బి.గోపిమూర్తి

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని . ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బి.గోపిమూర్తి డిమాండ్ చేశారు. ఎంఎల్‌సి గోపి మూర్తి కృతజ్ఞతా పర్యటనలో భాగంగా శుక్రవారం అల్లవరం మండలంలో పలు హైస్కూళ్ల సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతార పనులు తప్పించాలని, బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. మన బడి మన భవిష్యత్తు పాఠశాలలో కొరవ పనులు పూర్తి చేసేందుకు అనుమతులివ్వాలన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని నూతన పిఆర్‌సి కమిటీ ఛైర్మన్‌ను వెంటనే నియమించి ఐఆర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రయివేటు స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపి మూర్తి

పడవ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - మామిడికుదురు

అగ్నికుల క్షత్రియ సంఘం నేతత్వంలో పాశర్లపూడి లంకలో రెబ్బనపల్లి రేవు నుంచి గోగన మఠం రేవు వరకు వైనతేయ గోదావరిలో శుక్రవారం పడవల పోటీలు జరిగాయి ఈ పోటీలలో సుమారు 80 కి పైగా పడవలు జండాలతో ముస్తాబు చేసి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పోటీ లు నిర్వహించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా తొలిసారిగా ఈ పోటీలు నిర్వహించామని నిర్వాహకులు చింతా శ్రీనివాస్, అరదాని శ్రీనివాసులు తెలిపారు ఈ పోటీలలో పెసింగ్ భైరవ స్వామి మొదటి విజేతగా రూ.5 వేలు, కాటాడి పెద మీరాసాహెబ్ ద్వితీయ విజేతగా రూ.3 వేలు, కాటాడి సత్యనారాయణ తృతీయ విజేతగా రూ.2వేల నగదు బహుమతులు నిర్వాహకులు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టా నరసింహమూర్తి, జగతాని సత్యనారాయణ, పట్టా వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వెదురుమూడి ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ని 150 మంది విద్యార్థులకు శుక్రవారం ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. వెదురుమూడి సత్య సాయి సేవ కమిటీ ఆధ్వర్యంలో వీటిని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ డివి.సిద్ధాంతి, పాఠశాలల హెచ్‌ఎంలు డివి.రాఘవరావు, వి.వెంకటేశ్వర్లు, కె.ఉమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎంపిపి, ఛైర్మన్, సర్పంచ్

పశువుల దాణా విక్రయ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - అంబాజీపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయం పశువుల దాణా విక్రయ కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ అరిగెల సూర్యనారాయణ(సూరిబాబు)శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ, సహకార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 10 టన్నుల దాణా అందుబాటులో ఉందన్నారు. 50 కేజీల బస్తా రూ.1,020గా రైతులకు అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, పర్సన్‌లు ఉందుర్తి సత్యనారాయణ, పితాని, వివి.సత్యప్రసాద్, నాయకులు కొర్లపాటి గోపి, రవణం రాము, దొమ్మేటి సాయికృష్ణ, గుడాల ఫణి, మైపాల తాతాజీ, నాగ బత్తుల వెంకట సుబ్బారావు, గుత్తులసూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

పచ్చదనం- పరిశుభ్రంపై శిక్షణ

ప్రజాశక్తి - అయినవిల్లి

ఎస్.మూలపొలం గ్రామంలో పచ్చదనం- పరిశుభ్రం తదితర అంశాలపై గ్రీన్ అంబాసిడర్లకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ జివి.సరోవర్ తదితర అధికారులు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బ ప్రభాత్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వ ప్రాధాన్యత

. ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - అంబాజీపేట

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సూచించారు. గంగలకుర్రు అగ్రహారం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. అలాగే పుల్లేటికుర్రు సొసైటీ వద్ద కొనుగోలు కేంద్రాన్ని టిడిపి కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ ప్రారంభించారు ఈ సందర్భంగా డివివి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ప్రభుత్వం వాట్సాప్ సేవలో అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జి.అగ్రహారం సొసైటీ చైర్ పర్సన్ అల్లాడ సూర్య నారాయణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పుల్లేటికుర్రు ఛైర్మన్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు వాట్సాప్ సేవలపై ముందుగా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వర రావులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం మొత్తం రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సొసైటీ పర్సన్‌లు, స్టేట్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కె.కుమార్, గూడాల ఫణి, నాయకులు, రైతులు, సిఇఒలు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి


ఎంటియు-1444 వంగడంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - కె.గంగవరం

స్వర్ణ రకం కంటే ఇటీవల రూపొందించిన ఎంటియు 1444 రకం వరి వంగడం మేలైనదని ఇది తుపానులను తట్టుకొని నిలబడుతుందని, అధిక దిగుబడి ఇస్తుందని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ నందకిషోర్ తెలిపారు. కె.గంగవరం మండలంలోని శివల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఎక్కడ గరిమెళ్ళ భాస్కర రామశాస్త్రి పొలంలో ఎంటి యు-1444 రకం వరి పంటను పరిశీలించారు. ఎడిఎ నాగకుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ చిరు సంచిక్షేత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కొత్త రకాలను రైతులకు చేరువ చేసేందుకు, వాటి యొక్క దిగుబడి అంచనాలు కొరకు ఈ చిరు సంచులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పంట కోత కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపియు 1444 రకం స్వర్ణ కంటే బాగా తుపాను గాలికి పడుకోకుండా నిలబడుతుందన్నారు. మేలైన ఎరువులు యాజమాన్యం పద్ధతులు ఆచరించడం ద్వారా దిగుబడి బాగా ఇస్తుందని వివరించారు. ఈ క్షేత్రప్రదర్శనలో భాగంగా నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎకరా నికి 23 బస్తాలు దిగుబడి ఇచ్చిందన్నారు. తుపాను రాకుండా వాతావరణం బాగుంటే 30 బస్తాలు దిగబడి వచ్చేదన్నారు. ఈ రకానికి రైతులు వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిరు సంచి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షులు శివప్రసాద్, జిల్లా వనరులు కేంద్రం ఎఒ మనోహర్, మండల ఎఒ సద్గురు మూర్తి, ఎఇఒ హేమంత్, విఎఎ దేవి రైతులు పాల్గొన్నారు.


కొత్తరకం వరి వంగడాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

కార్టూన్'నిజం'



పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపేట

పుస్తకాలను పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని కొత్తపేట ఆర్‌డిఒ పి. శ్రీకర్ విద్యార్థులకు ఉద్బోధించారు. కొత్తపేట శాఖా గ్రంథాలయం నందు శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల ముగింపు సభ గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్‌డిఒ శ్రీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టివి, సెల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించి పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తన బాల్యంలో ఎక్కువగా ఆటలకు ప్రాధాన్యత ఇస్తుండేవాడినని, అయితే తన తల్లి ఆటలతో పాటు పుస్తకాలను కూడా చదవాలని సూచిస్తూ బారిష్టర్ పార్వతీశం పుస్తకాన్ని ఇస్తే ఆ పుస్తకాన్ని చదివేవాడినని గుర్తు చేసుకున్నారు. ఆ పుస్తకం ద్వారా మంచి విషయాలను తెలుసు కున్నానని అన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. అనంతరం గ్రంథ పాలకురాలు సునీత నేతృత్వంలో కొత్తపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్.వీరన్న, రోటరీ క్లబ్ జాయింట్ సెక్రెటరీ కూచి మంచి సుధాకర్, రిటైర్డ్ లైబ్రేరియన్ చామకూర నాగేశ్వరరావు తది తరులు ఆర్‌డిఒ శ్రీకర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట తహసిల్దారు వై.రాంబాబు, విఆర్ఒలు వీరేంద్ర, వి.సుభాషిణి ఉపాధ్యాయులు నూక పేయి శివరత్నం, కె.శ్రీనివాస్, కుసుమ అనూష, లలిత తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ పి.శ్రీకర్

సేంద్రియ ఎరువుల విక్రయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఎంపిడిఒ హెచ్.భానూజీరావు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కపిలేశ్వరపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన క్లాప్ మిత్రులు గ్రామంలో చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తడి పొడి చెత్తను విభజించారు. చెత్త నుంచి ఏ విధంగా వర్మికంపోస్టు తయారవుతుంది అనే విధానాన్ని శిక్షణ పొందిన వాకతిప్ప గ్రామ కార్యదర్శి, వెంకటేశ్వర్లు, అంగర గ్రామ కార్యదర్శి ఆర్.మోహన్ క్లాప్ మిత్రులకు వివరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ నందు క్లీన్, గ్రీన్ కార్యక్రమం పై ఎంపిడిఒ భానూజీరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్ర, షెడ్ మిత్రులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.వరప్రసాద్, మండల పరిషత్ ఎఒ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, కార్యదర్శి శివ చక్రవర్తి, క్లాప్ మిత్రులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లిలో వైసిపి కోటి సంతకాల సేకరణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ వల్ల పేద విద్యార్థులకు జరుగుతున్న నష్టాని మండలంలో కళాశాల విద్యార్థినిలు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని కోటి సంతకాల పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు మిండగూటి శిరీష్, మాజీ సొసైటీ ఛైర్మన్ నంబూరి శ్రీరామచంద్రరాజు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గుత్తుల నాగబాబు, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షులు కడలి భూపతి, రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ చెట్ల రామారావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు పులిదిండి ప్రభాకర్ తదతరులు పాల్గొన్నారు.


పాల్గొన్న వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

గోడిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్


ప్రజాశక్తి - అల్లవరం

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ లో భాగంగా గోడి గ్రామ పంచాయతీ ఎంపికైనందున ఆ గ్రామంలో ఎంపిడిఒ కెఎస్.గౌరీకుమారి పర్యవేక్షణలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మం డలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యదర్శులను, పంచాయతీ సిబ్బంది, అన్ని పంచాయతీల శానిటేషన్ సిబ్బంది మొత్తం 50 మందిని 10 వార్డులకు కార్యదర్శులను ఇన్‌ఛార్జిగా నియమించి టీమ్‌లుగా ఏర్పాటుచేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సుమారు 4 టన్నులు చెత్తను తరలించారు. ఎస్‌డబ్ల్యూపిఎస్ షెడ్ దగ్గర తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం, వర్మీ తయారు చేయడంపై అందరూ గ్రీన్ గార్డ్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గౌరీ కుమారిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీదేవి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్యనారాయణరాజు, ఎంపిటిసి సభ్యుడు కాండ్రేగుల వాణి కూటమి నాయకులు, అన్ని గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో తరగతి గదుల ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ఆధునికీకరించిన ప్రిన్సిపల్ గది, స్టాఫ్ రూమ్ లను ప్రముఖ పారిశ్రామికవేత్త, కొత్తపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు ప్రారంభించారు. ఈ రెండు గదుల ఆధునికీకరణ కోసం పాపారావు రూ.2 లక్షలు విరాళంగా అందించిన విషయం విధితమే. ఈ మేరకు పనులు పూర్తి కావడంతో గదులను శుక్రవారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల అభివద్ధికి ఇతోధికంగా కషి చేస్తున్న దాత పాపారావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, గారపాటి త్రిమూర్తులు, గుణ్ణం వీర్రాజు, కాలా సాయిబాబు, చల్లా వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న దాత పాపారావు

వాడపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పలు అభివద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. శుక్రవారం ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ప్రత్యేక పూజల అనంతరం పనులను ప్రారంభించారు. స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని మరో అనుకూల ప్రదేశంలో ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ఉన్న సమస్యలు, యాత్రికుల సౌకర్యాల మెరుగుదల, క్యూ లైన్‌ల ఏర్పాటుతో సంబంధించి అర్చకులతో అధికారులు సమీక్షించారు.

కార్తీక మాసం ఆదాయం రూ.5.51 కోట్లు

కార్తీక మాసం సందర్భంగా స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.5 కోట్ల 51 లక్షల 55 వేల 734 సమకూరినట్లు ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసం కంటే ఈ సంవత్సరం కార్తీక మాసంలో రూ.75,92,305 అదనంగా సమకూరినట్లు ఆయన తెలిపారు.

బాల బాలాజీ కార్తీక మాస ఆదాయం రూ.72.88 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయానికి కార్తీక మాసం సందర్భంగా వివిధ సేవల ద్వారా ఈ ఏడాది రూ 72,88,637 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్య నారాయణ రాజు శుక్రవారం తెలిపారు. గత ఏడాది కార్తీక మాసం సందర్భంగా రూ 55,11, 637లు ఆదాయం రాగా గత ఏడాది కంటే ఈ ఏడాదిరూ 17,77,018లు అదనముగా ఆదాయం సమకూరిందన్నారు.

పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాజమహేంద్రవరంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న పిడిఎస్‌యు రాష్ట్ర 24వ మహాసభ పోస్టర్లన రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎస్‌యు 51 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం, శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపన కోసం పోరాటం చేస్తోందన్నారు. సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా పిడిఎస్‌యు స్పష్టమైన ఉద్యమాలు నిర్వహించిందని తెలి పారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం, మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ మెస్ ఛార్జీల పెంపు, కాస్మోటిక్ ఫీజుల వంటి సమస్యలపై పిడిఎస్‌యు నిరంతర పోరాటం కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల విద్యార్థులు భారీగా తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెదాడు. పల్లంట్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి రవి గౌరీపట్నం స్టోన్ క్రషర్ వద్ద కార్మికునిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం క్రషర్ నుంచి బైకుపై వెళ్తున్నాడు. గౌరీపట్నం వద్దకు చేరుకునే సరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఐషర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి(35) అక్కడికక్కడే మరణించాడు. ఢీ కొట్టిన తర్వాత వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. రవికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని సూరయ్యపేట, భీమోలు సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బెల్లపు ఊటతోపాటు సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు గిన్నెలు కూడా ధ్వంసం చేశామన్నారు.

దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు మృతి చెందాడు. దొంతి కుర్రు మెయిన్ రోడ్డు పక్కన కొబ్బరి చెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మోకు అదుపుతప్పింది. చెట్టు పైనుంచి వేలాడుతుండగా మరొక దింపు కార్మికుడు చెట్టు ఎక్కే లోపు దింపు కార్మికుడు కర్రీ అప్పలరాజు కింద పడి మృతి చెందాడు. స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. 108 అక్కడికి చేరుకునే లోపు కార్మికుడు మరణించినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చి గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో అప్పలరాజు దింపులు తీస్తుంటాడని స్థానికులు తెలిపారు. జరిగిన సంఘటనపై బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దొంగిలించిన ఆవుదూడ లభ్యం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన పుంగనూరు ఆవు దూడ ఆచూకీ లభ్యమైంది. పినపళ్ల గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభిరామన్న రూ.2.50 లక్షల విలువైన తన 15 రోజుల పుంగునూరు ఆవు దూడను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలించారు. అయితే గుర్తు తెలియని దుండంగులు గురువారం అర్ధరాత్రి ఆవు దూడను పశువులపాక వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆవు దూడను గమనించిన పశువుల రైతు పట్టాభి దూడను తల్లి చెంతకు చేర్చారు.

వైసిపి ఆరోణలకు ఖండన


ప్రజాశక్తి - రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తున్నారంటూ వైసిపి చేస్తున్న ఆరోపణలను కూటమి పార్టీ నాయకులు ఖండించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, ఎస్కెపిపి ట్రస్ట్ ఛైర్మన్ సలాది నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, కంచుమర్తి బాబురావు తదితరులు విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలలు పిపిపి విధానంలో నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య విద్య అందేలా కృషి చేస్తుంటే, వైసిపి నాయకులు అవగాహన లేకుండా విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కూటమి పార్టీ నాయకులు, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, కవల నానాజీ, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోసును విమర్శించే స్థాయి కూటమి నాయకులకు లేదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

సీనియర్ రాజకీయ నాయకులు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ విమర్శించే స్థాయి కూటమి నాయకులకు లేదని వైసిపి అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ ఉద్యమంపై కూటమి నాయకులు చేసిన వ్యాఖ్యలకు ఆయన సమాధానం ఇచ్చారు. చిన్న పిల్లల చేత సంతకాలు చేయించుకుంటున్నారనే ఆరోపణ ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి ప్రజా వ్యతిరేక కార్యక్రమాల పైన పోరాటాలు చేస్తూనే ఉంటామ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, వైస్ ఎంపిపి శాకా బాబీ, పట్టణ కన్వీనర్ గాదం శెట్టి శ్రీధర్, వైస్ ఛైర్మన్ కోలమూరి శివాజీ, సర్పంచ్ అనిశెట్టి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందిస్తున్న అర్చకులు

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ జగన్నాథరావు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించికుని, పూజలు నిర్వహించారు అనంతరం నిత్యాన్నదాన నిధికి రూ.20,232 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్‌రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

26న డిప్యూటీ సిఎం పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

రాజోలు నియోజ కవర్గంలో ఈ నెల 26న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా స్థాయిలో రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్‌పి రాహుల్ మీనా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26న బుధవారం ఉదయం 10.30 గంటలకు డిప్యూటీ సిఎం రాజోలు పర్య టనకు వచ్చే అవకాశం ఉందన్నారు. 26న రాజమండ్రి నుండి ప్రత్యేక హెలికాప్టర్లో శివకోడు హెలి ప్యాడ్ చేరుకుంటారని అక్కడి నుంచి కేసనపల్లి శంకర్ గుప్తం డ్రయిన్ ఆనుకుని ఉన్న 12 గ్రామాల పర్యటించి దారి పొడవునా కొబ్బరి చెట్లు చనిపోయిన బాధిత రైతు లతో మాట్లాడతారన్నారు. తదుపరి శివకోడు చేరుకుని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాపు కళ్యాణ మండపం వద్ద పల్లె పండుగ 2.0 రాష్ట్రస్థాయి మీటింగ్లో పాల్గొంటారన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.. రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ కేసనపల్లి శివకోడులలో హెలిప్యాడ్లు సిద్ధం చేయా లన్నారు. మొత్తం పర్యటన సమయం సుమారు రెండున్నర గంటలు ఉంటుందన్నారు జిల్లా యంత్రాంగం పోలీస్ అధికారులు పర్యటన సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి పర్యటన విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెసి నిశాంతి, డిఆర్ఓ మాధవి జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



నవాబుపేటలో పారిశుధ్యం పై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రాజు

పైలెట్ ప్రాజెక్ట్‌గా నవాబుపేట ఎంపిక

ప్రజాశక్తి - ఆలమూరు

క్లీన్ అండ్ గ్రీన్ కోసం నవాబుపేట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ఎంపిడిఒ ఎ.రాజు తెలిపారు. జీరో వేస్ట్ మేనేజ్మెంట్లో భాగంగా ప్రత్యేక పారిశుధ్యానికి కేరాఫ్ అడ్రస్ గా నవాబుపేట నిలుస్తుందని ఆయన అన్నారు. నవాబుపేటలో ఆయన ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత కోసం చెత్త సంపద కేంద్రం, గ్రామ చెరువులు, రోడ్ల పరిసరాలు, డ్రెయినేజీలు శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు మండల పరిధి పంచాయతీ కార్యదర్శులు, 70 మంది గ్రీన్ అంబాసిడర్ల లతో కలిసి ఏకకాలంలో నవాబుపేటలో గ్రామంలో 348 గహాలకు చెందిన చెత్తను సేకరించి రిక్షాలు, ట్రాక్టర్ల పై తరలింపులు పూర్తి చేశామని తెలిపారు. అలాగే స్థానిక సిబ్బంది నుంచి పారిశుధ్య నిర్వహణపై వివరాలు సేకరించి గ్రామ శివారులలో క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు తెలిపారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగిస్తూ పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకోవాలని ఆయన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందికి, గ్రామస్తులకు వివరించారు. వివిధ రకాల మొక్కలను గ్రామ పరిధిలో నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రెయినేజీలను అనునిత్యం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ ద్వారా అందజేసిన డస్ట్ బిన్లలో తడి, పొడి చెత్త వేరువేరుగా గ్రామస్థులు తప్పకుండా సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఆ విధంగా చేయడం వలన పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణకు ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లలో వర్మీ కంపోస్ట్ తయారీకి సహకారం అందించి వచ్చున్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుచంద్ర స్వరూప్, మాజీ ఉపసర్పంచ్ నామాల సత్తిబాబు, కార్యదర్శులు బి.వెంకట రత్నం, సాయి ప్రసాద్, ఎస్.వీర్రాజు వి.హనుమ, పి.వెంకటలక్ష్మి, వి.వేణి, సిహెచ్.సుభాష్, సిహెచ్.వీర వెంకటరెడ్డి, సిహెచ్.వీరమాత, వీరన్న చౌదరి, పద్మావతి, వై.అయ్యన్న, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో పాల్గొన్న ఎంపీ బోసు, సర్పంచ్ సతీష్‌కుమారి తదితరులు

వెంకటాయపాలెంలో కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా కులాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ పిల్లి అప్పారావు ఆడిటోరియంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ హాజరయ్యారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యతకు వన సమారాధనలు దోహదం చేస్తాయన్నారు. స్నేహం, అభిమానం, పెంపొందించుకునేందుకు ఇవి తోడ్పడతాయన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారిని ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వాసంశెట్టి శ్యామ్ గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెలిచేరు నుంచి రాజవరం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

తుప్పలతో వాహనదారులకు అవస్థలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామం నుంచి రాజవరం వెళ్లే పొదలాడ రాజవరం ఆర్ అండ్ బి రోడ్డు మార్గంలో రోడ్డు కిరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకుని మార్గం లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో తరచూ ఈ రోడ్డు మార్గంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వెలిచేరు, రాజవరం గ్రామస్తులు సంబంధిత అధికారులకు విష యాన్ని విన్నవించుకున్న వారు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తుప్పలు బాగా పెరిగిపోయాయి. గతంలో ఉపాధి హామీ చట్టంలో రోడ్లకు ఇరువైపులా తుప్పలను తొలగించేవారు. ఇప్పుడు ఆ పనులు చేపట్ట పోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు కలగజేసుకుని రోడ్డు విరువైపులా పెరిగిన తుప్పలను తొలగించి వాహన దారుల అవస్థలు తీర్చాలని పలువురు కోరుకుంటున్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మాక్ విద్యార్థుల అసెంబ్లి కార్యక్రమానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు.

ఆలమూరు: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమరావతిలో జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీకి మండల కేంద్రం ఆలమూరుకు చెందిన కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అనసూరి లోకేష్ కుమార్ ఎంపికవ్వడం అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద లోకేష్ కుమార్ ను ఎంఎల్ఎ బండారు సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, మాజీ జెడ్‌పిటిసి రామానుజల శేషయ్య, టిడిపి నేత ముప్పిరి వెర్రియ్య, ఎంఈఓ అప్పాజీ, క్రాఫ్ట్ టీచర్ గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** విద్యార్థుల అసెంబ్లీ కార్యక్రమానికి గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఉప్పలగుప్తంకు చెందిన యనమదల ఇందిర ఎంపికయింది. ఇందిర అండర్ 17 పవర్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలలో ఇందిరను హెచ్ఎం జి.కనకదుర్గ, ఎస్ఎంసి ఛైర్మన్ వాలా సత్తిబాబు ఉపాధ్యాయులు అభినందించారు.

జెసికి అంబేద్కర్ పుస్తకం బహూకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మొంథా తుపానులో అందించిన విశిష్ట సేవలకు జెసి నిషాంతి కి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పుస్తకాన్ని అందించి సత్కరించారు. ముమ్మిడివరం జూనియర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వర రావు శుక్రవారం కలెక్టరేట్‌లోని జెసి కలెక్టర్ ఛాంబర్‌లో జెసి నిషాంతి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల సంబవించిన మొంథా తుపాన్ సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి మరియు పశు నష్టం లేకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమతం చేసి సామర్థవంతమైన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పుస్తకాన్ని బహూకరించారు.

పుల్లేటికుర్రు విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు హైస్కూల్ లో 9వ తరగతి విద్యార్థి చీకిరిమిల్లి హర్షవర్ధిని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో 1500 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించిందని హెచ్ఎం బీర ధర్మరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని , తర్ఫీది ఇచ్చిన పిఇటిలు అందె సూర్యనారాయణ, ఉమా భాస్కర్ లను సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసి ఛైర్మన్ నూకల శ్రీ రత్నమాల, సభ్యులు తదితరులు అభినందించారు.



ఎన్. కొత్తపల్లిలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరించిన సర్పంచ్ చిట్టి కుమారి చిన్ని, అధికారులు

పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. తీర గ్రామమైన ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయతీని పచ్చదన,ం పరిశుభ్రత గ్రామంగా తీర్చిదిద్దారు. సర్పంచ్ కుంచే చిట్టికుమార్ చిన్ని ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ డి.కృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పూర్తిగా తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. గ్రామంలో ప్రజలు చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు పచ్చదనం పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అనంతరం పారిశుధ్యం పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు.

విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షునిగా సురేష్

ప్రజాశక్తి - ఆలమూరు

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అమలాపురం సర్కిల్ అధ్యక్షునిగా ఆలమూరుకు చెందిన గొడవర్తి సురేష్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా భారతి వెంకటేశ్వరరావు, సభ్యులుగా దేవదాసు రమేష్, బడుగు రాజు, కుడుపూడి బాలాజీలు నియమితులయ్యారు. యూనియన్ అభివృద్ధి, విద్యుత్ కార్మికుల శ్రేయస్సుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు గొడవర్తి సురేష్ విలేకరులకు తెలిపారు.

ఆపరేషన్ డ్రాగన్ ఆక్టోపస్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి-మామిడికుదురు



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బృందం

తాటిపాక గెయిల్‌లో రాష్ట్ర పోలీస్ కమాండో విభాగమైన ఆక్టోపుస్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ డ్రాగన్' పేరుతో శుక్రవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారని నగరం ఎస్ఐ చైతన్య కుమార్ తెలిపారు. డ్రిల్ సజావుగా కొనసాగేందుకు ముందు నుంచే సమన్వయాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో ప్రత్యేక కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో గెయిల్ జిఎం కెబి.నారాయణ, డిజిఎం ఎస్‌వి.మూర్తి, డిజిఎం ప్రభాకర్ దీవి, సెక్యూరిటీ ఆఫీసర్ సాగర్ కుమార్ పెంటకోట , ఆక్టోపస్ డి.ఎస్.పి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.ఈ మాక్ డ్రిల్‌లో కోనసీమ జిల్లా ఏఆర్ విభాగానికి చెందిన బాంబ్ డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ ఇతర పోలీసు బలగాలు సైతం పాల్గొని ప్రావీణ్యం ప్రదర్శించారు.

నేడు ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి- పి.గన్నవరం

పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ తాడేపల్లి ఆదేశాల మేరకు డిలీట్ అయిన జాబు కార్డులకు సంబంధించి తీర్మానం ఈ నెల 22 న శనివారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎపిఒ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై పి.గన్నవరం మండల పరిధిలో అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు.

నేటి నుంచి బాలికలకు శిక్షణ

ప్రజాశక్తి - అంబాజీపేట

నేటి నుంచి హైస్కూల్‌లు నందు 6 నుంచి 12 వ తరగతి వరకు బాలికలకు రాణి లక్ష్మీబాయి ఆత్మ నిర్భణపై శిక్షణ ఇస్తారని డిఇఒ సలీమ్ బాషా తెలిపారు. అంబాజీపేట హైస్కూల్ నందు శుక్రవారం సమగ్ర శిక్ష వికాసం రక్షణాధికారి ఎపిఒ ఎంఎకె.భీమారావు పర్యవేక్షణలో ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌ల అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు..అనంతరం పదవ తరగతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు డిఇఒఅందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాయి రామ్, పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్, కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని సానపల్లి లంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కెఎస్ ఎస్.మణికంఠ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–17 బాల బాలికల పవర్ లిఫ్టింగ్ 105 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పంబల గోపి కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.బాలకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పెద్దలు, ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందించారు.

బౌద్ధ దమ్మ ప్రచార యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శుక్రవారం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బిఎస్ఐ మండల శాఖ అధ్యక్షుడు సింహాద్రి వర్య అధ్యక్షతన సమావేశం నిర్వ:హించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలతో పాటు జ్ఞానతృష్ణ సాధనకు బౌద్ధం ఎంతో దోహదం చేస్తుందన్నారు. మరో అతిథి జిల్లా కార్యదర్శి బుడితి బాబు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 23న మండలంలో జరగనున్న బౌద్ధ దమ్మ ప్రచార యాత్రను బౌద్ధులు, అంబేద్కరీయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాసకులు మట్టా వెంకట్రావు, కవి, దత్తు, కాశీ బాబు జగజీవన్ రావు, డి.ఆంజనేయులు, వడ్డి నాగేశ్వర రావు, అప్పారావు, పలువురు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యవర్గం

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీను

ప్రజాశక్తి - అమలాపురం

ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ అమలాపురం డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించారు. అధ్యక్షునిగా నిమ్మకాయల శ్రీను (పంచాయితీ రాజ్ ఇఇ కార్యాలయం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా మహాదశ శ్రీనివాసరావు, సెక్రెటరీగా పి.కోదండరామయ్య, ట్రెజరర్‌గా డి.పృథ్వీరాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా డి.రామకృష్ణ, డి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారులు డిఎస్ఎన్. సుబ్రమణ్యం, ఐ.ప్రతాప్‌రాజ్ ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని ఎపి ఎన్‌జిఒ కోనసీమ జిల్లా అధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వరరావు, ఎపి పిఆర్‌డి ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అన్యం రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గా కొండలరావు, పంచాయతీ రాజ్ ఇఇ పి.రామకృష్ణారెడ్డి పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి, అధికారులు

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలు తప్పక గుర్తింపునిస్తాయని సర్పంచ్ సలాది ఊర్మిళదేవి అన్నారు. విలసవిల్లిలో శుక్రవారం సర్పంచ్ ఊర్మిళదేవి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన సచివాలయ, పంచాయితీ ఉద్యోగులను సత్కరించారు. బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, విఆర్ఒ నూర్ అహ్మదాలీషా, ఇంజనీరింగ్, డిజిటల్, వెటర్నరీ అసిస్టెంట్లు వరసాల ప్రసన్న, నంద్యాల నాగేశ్వరరావు, గోవిందు, సర్వేయర్ వర్ధన్, మహిళా పోలీస్ శ్రీలక్ష్మి, ఎఎన్ఎం అపర్ణలను సర్పంచ్ ఊర్మిళదేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎంపిడిఒ డి.కృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకష్ణ, కార్యాలయ ఎఒ భూపతి రాజు తులసి కృష్ణ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాసా వీరభద్రుడు, కోలా ఏసు, కారుపర్తి గిరిజాపతి, పుత్సల ఏసు, బళ్ల నాగ సతీష్, బీర నరసింహమూర్తి, మల్లెపూడి రత్నం, నందుల సత్యతాళ్ల మల్లిబాబు, ఉంగరాల నాగేశ్వరరావు, నందుల మల్లేష్, వడ్డి రాజేష్, చప్పిడి చంద్రశేఖర రావు, బీర శాంతకుమారి, గుండుమోగుల రామకృష్ణ, ఆశపు బుజ్జి, ఊటుకూరి చిన్నలంక ప్రసాద్, భీమవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి సభ్యుడు సంపదరావుకు పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కాలికి గాయమై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావును శుక్రవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో అమలాపురం రూరల్ జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు,వ ఐనిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు నాయకులు తదితరులు ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలలో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్న, ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గుత్తుల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు శీలం భాస్కరరావు,పెయ్యల తిరుమల రావు తదితరులు అభినందించారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని ఓల్డ్ అయినాపురం ట్రైన్ వంతెన సమీపంలో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. నిర్మాణ పనులపై రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర టిడిపి నాయకులు సుబ్బరాజు, గుత్తుల సాయి, మండల తెలుగు యువత అధ్యక్షులు వంగ దుర్గ బాబు, పిఎస్ఎన్.రాజు, ఎస్‌విఎస్.రవివర్మ తదితరులు ఉన్నారు.